
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024



రోడ్డు పక్కనే వ్యర్థాలు

దుర్వాసనతో జనం ఇబ్బందులు
ఫంక్షన్ హాళ్ల నుంచి చెత్తాచెదారం
పట్టించుకోని అధికారులు
చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



8

పాపం పసికందు

ఆటో టైరుకింద నలిగి ప్రాణాలు కోల్పోయిన చిన్నారి
పాల డబ్బాలు లోడ్ చేస్తుండగా ఘటన.. గమనించని డ్రైవర్
ఆటోను ముందుకు తీయడంతో ప్రాణాలు కోల్పోయిన పాప
తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ప్రమాదం



7

సమాచారం

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి మేడిపల్లి లోని 33/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల తోపాటు వైర్ల కింద చెట్ల నరికివేత పనులు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు.

ఎన్నిక



నియామకపత్రాన్ని అందజేస్తున్న బర్క కృష్ణ

42% రిజర్వేషన్ కల్పించాలి

షాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో బీసీసేన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షునిగా ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మాణిక్యం, నర్సింహులు, ప్రధానకార్యదర్శిగా కుమార్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 23శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

ఈ ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌కూ చేదు అనుభవాలే మిగిలాయి. పార్టీలు మారిన నేతలకు భంగపాటే మిగిలింది. గతేడాది అధికారం పోగొట్టుకున్న బీఆర్‌ఎస్‌కు ఈ సంవత్సరం సైతం కలిసి రాలేదు. వరుస జంపింగ్‌లతో ఉక్కిరిబిక్కిరైంది. రసవత్తరంగా జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటూ దక్కలేదు. కమలం పార్టీ మాత్రం వికసించింది. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. అలాగే ఈ ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అనుకున్నప్పటికీ.. రిజర్వేషన్ల కారణంగా బ్రేక్ పడింది. ఈ ఎన్నికల కోసం ద్వితీయ శ్రేణి నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది కాలంలో జరిగిన ఉమ్మడి జిల్లా రాజకీయాలపై రౌండప్.



రౌండప్ 2024

కీలక మలుపులు

రాజకీయం.. రసవత్తరం



ఉత్కంఠగా జరిగిన ఎంపీ ఎన్నికలు
జంపింగ్‌లతో పార్టీల ఉక్కిరిబిక్కిరి
కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కలిసిరాని కాలం
రెండు సీట్లతో వికసించిన కమలం
పార్టీలు మారిన నేతలకు తప్పని భంగపాటు
అధికార పార్టీలో 'నామినేటెడ్' భర్తీలు
సంచలనంగా మారిన లగచర్ల ఘటన
స్థానిక ఎన్నికలకు ఎదురుచూస్తున్న నాయకులు
ఉమ్మడి జిల్లా పొలిటికల్ రౌండప్ -2024

6

రంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రాష్ట్ర రాజకీయాలకు కేరాఫ్‌గా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో ఇక్కడి నుంచే కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఈ ఏడాది పెద్దగా కలిసిరాలేదు. గతేడాది అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు ఒకొక్కరుగా అధికార పార్టీలోకి చేరుకోవడంతో ఆ పార్టీ బలహీన పడింది. ఈ ఏడాది ఎంపీ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధినేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, అమిత్‌షా, కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధి రోడ్డు షోల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలు దక్కించుకున్న బీఆర్ఎస్ ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. అలాగే అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీకి సైతం ఒక్క సీటూ దక్కలేదు. కానీ.. కమలం వికసించింది. చేవెళ్ల, మల్కాజిగిరి, పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో సంపన్నులు బరిలో దిగారు. ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌కు మల్కాజిగిరి టికెట్ దక్కింది. బీఆర్ఎస్ చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి

మిగతా 7వ పేజీలో...



ఇబ్రహీంపట్నంలో సీపీఎం జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.సుదర్శన్ వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలోని భారత్ గార్డెన్స్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న సీపీఎం జిల్లా పదవ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహాయిస్తే ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రైతు రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో చేయలేదని ఆరోపించారు. రైతు బంధును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని, గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను లాక్కోవడం అన్యాయమని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో కూలీలకు పనులు కల్పించడంలో సమస్య ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామిక వర్గాలపట్ల చిన్నచూపు చూస్తున్నాయన్నారు. వీరి చర్యలు కార్పొరేట్, ధనిక వర్గాలకు లాభం చేకూర్చేలా ఉన్నాయన్నారు. రామోజీ ఫిలిం సిటీ వద్ద గతంలో పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి వెంటనే స్థలాలు చూపి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ మాట్లాడుతూ షాబాద్, చందన్‌వెల్లి నుంచి పారే ఫిరంగి కాలువ అనేక చోట్ల కబ్జాకు గురైందని, హైడ్రా కమిషనర్ స్పందించి కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు, భూపాల్, జిల్లా నాయకులు పగడాల యాదయ్య, బి.మధుసూదన్‌రెడ్డి, బి.సామేల్, డి.జగదీశ్, కవిత, సీ.హెచ్.బుగ్గరాములు తదితరులున్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు రైతులు

ఫార్మాసిటీ రద్దు చేయాల్సిందే

» ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

యాచారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాలలో ఫార్మాసిటీ ఏర్పాటును రద్దు చేసేవరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, నాయకులు నిరంజన్, వినోద్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కుర్మిద్ద, మంగలిగడ్డ తండాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిదని విమర్శించారు. అధికారం కోసం జనాలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులు ఫార్మాసిటీ ఏర్పాటు కోసం పేదల భూములను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాకంపెనీలు ఏర్పాటు చేస్తే ఇక్కడ జీవనం దుర్భరం అవుతుందన్నారు. కార్యక్రమంలో మల్లేష్, వెంకటేష్ దేవోజీ, అచ్చిరెడ్డి తదితరులున్నారు. కాగా సోమవారం తాటిపర్తి గ్రామంలో ర్యాలీ నిర్వహించి సభలు ఏర్పాటు చేస్తామని వారు వెల్లడించారు.



ఆరుట్లలో మృత్యువాత పడిన కోళ్లు

బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత

ఆర్‌డీ వైరస్‌తో వందల సంఖ్యలో మృతి

వెలవెలబోతున్న పౌల్ట్రీఫాంలు
తీవ్రంగా నష్టపోతున్న రైతులు

మంచాల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధిలోని ఫాంలలో పెంచుతున్న బ్రాయిలర్ కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయి. గత కొన్నిరోజులుగా వందల సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుట్ల, చెన్నారెడ్డిగూడ, చిత్తాపూర్ తదితర గ్రామాల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంది. ఆయా గ్రామాల్లో మొత్తంగా 50 లక్షలకు పైచిలుకు కోళ్ల సామర్థ్యం గల షెడ్లు ఉన్నాయి. అయితే ఈ షెడ్లలో పెంచుతున్న కోళ్లు మృత్యువాత పడుతుండటంతో కనీస ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు. గతంలోనూ ఆర్‌డీగా పిలుచుకునే ఈ వ్యాధిసోకి కోళ్లు చనిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి బారిన పడిన కోళ్లకు

మిగతా 8వ పేజీలో...

కార్పొరేట్ సంస్థల నియంత్రణలో పౌల్ట్రీఫాంలు

వ్యవసాయ అనుబంధ రంగంగా అన్నదాతలు పాడిపశువులతో పాటు పౌల్ట్రీని ఎంచుకుని జీవనం కొనసాగిస్తున్నారు. మంచాల మండల పరిధిలో మొత్తం ఎనభై లక్షల పైచిలుకు కోళ్ల సామర్థ్యం గల బ్రాయిలర్ పౌల్ట్రీ ఫాంలు ఉన్నాయి. వందల సంఖ్యలో రైతులు బ్రాయిలర్ కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. పదివేల కోళ్ల సామర్థ్యం గల పౌల్ట్రీఫాం నిర్మాణం కోసం రైతులు సుమారు రూ.25 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ భూములను బ్యాంకుల్లో తనఖాపెట్టి రుణం పొందుతున్నారు. కోడిపిల్లల పెంపకం చేపట్టే ఆర్థికసామర్థ్యం, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో పౌల్ట్రీ రైతులు తమ షెడ్లను కార్పొరేట్ కంపెనీలు, వ్యాపారులకు లీజుకిస్తున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

'గోర్‌బోలి'ని రాజ్యాంగంలో చేర్చాలి

లంబాడ హక్కుల పోరాట సమితి


షాద్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) లంబాడీల గిరిజన భాష గోర్‌బోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ చేర్చాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణం రైల్వేస్టేషన్ నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తే గిరిజనులను విడదీసి విద్వేశాలు రెచ్చగొట్టడం సమంజసం కాదన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోహన్‌సింగ్, మిట్టునాయక్, విస్లావత్ చంద్రానాయక్, దాసరం నాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీటింగ్.. చీటింగ్!

న్యూఇయర్ విషెస్ లింక్‌లతో బీకేర్‌ఫుల్

ఓపెన్ చేస్తే అంతే సంగతులు
ఒక్క క్లిక్‌తో ఫోన్లో డబ్బులు మాయం!
రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు
అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

7



మరో రెండు రోజుల్లో రాబోతున్న నూతన సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పే వేళ సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమవుతున్నారు. విషెస్ పేరిట మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా సందేశాల లింక్‌లు పంపిస్తున్నారు. గుర్తుతెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను క్లిక్ చేస్తే చాలు.. అకౌంట్లలోని నగదును క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు రోజులూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌లు సూచిస్తున్నారు.

చేవెళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న విజయభాస్కర్ రెడ్డి

ధ్యానంతో ఆనందమయ జీవనం

» పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్ , డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా ఆనందమయ జీవనం పొందవచ్చని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు పరిణతి పత్రీజీ అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు-3 తొమ్మిదొవ రోజు ఆదివారం అట్టహాసంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ధ్యానులు, ఆధ్యాత్మిక వేత్తలు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. వేడుకలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మణ్ రావు, హన్మంత్ రావు, మాధవి, లక్ష్మీ, దామోదర్ రెడ్డి, సాంబశివరావు, బాలకృష్ణ, జయశ్రీ, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు



ఎర్రోనిగూడలో బోనాలతో ఆలయానికి తరలిన మహిళలు, గ్రామస్తులు

షాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామంలో మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలతో తరలి ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకులు కేరింతలతో బోనాలు, తొట్టెల ఊరేగింపు జరిగింది. గ్రామస్థులంతా ఊరువాడా సల్లంగ సూడు మైసమ్మ తల్లీ అంటూ కోరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రతాప్ రెడ్డి, గ్రామస్థులు మల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, గురుస్వామి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి గీసిన విచిత్రం



సింధూరం పులుముకున్న ఆకాశం.. పక్షుల విహంగం... మబ్బుల చాటుకు వెళ్తున్న భానుడు.. సంద్రంలో నింగిలోని రంగుల ప్రతిబింబం.. ఈ అపురూప దృశ్యాన్ని చూస్తే.. ఇదేమైనా కళాకారుడు గీసిన చిత్రమా అనే భావన కలగకమానదు. కానీ ప్రకృతి గీసిన ఈ చిత్రం హిమాయత్ సాగర్ సమీపంలో ఆవిష్కృతమైంది. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

ఓవర్‌లోడ్ వాహనాలపై
చర్యలేవి?

- నిబంధనలు అతిక్రమిస్తున్న లారీల యాజమానులు
- దెబ్బతింటున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాండూరులో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓవర్‌లోడ్ వాహనాలతో రహదారులు దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి మరమ్మతులకు కోట్లాది రూపాయలు అవసరమవుతుండటంతో నిధులులేక నీరసించిన ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు కారణమైన సిమెంట్ కర్మాగారాలకు తాండూరు ప్రాంతంలో 500ల వరకు నిత్యం లారీలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలన్నీ అధిక బరువుతోనే వెళ్తుంటాయి.

సామర్థ్యానికి మించి రవాణా

తాండూరు ప్రాంతంలో వందలాది ఎకరాల్లో నాపరాయి పరిశ్రమలు, సుద్దగనులు, సీసీఐ, అదాని, అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారాలు విస్తరించి ఉన్నాయి. 7వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సామర్థ్యాన్ని మించి లారీల్లో ఎర్రమట్టి, సిమెంట్ బస్తాలు, నాపరాతి బండలు, సిమెంటు ట్యాంకర్లు, సుద్దను తాండూరు రోడ్ల గుండా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. రోడ్డు సామర్థ్యాన్ని పట్టించుకోకుండా లారీలు సరుకును తరలిస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేసినా ఓవర్‌లోడ్‌తో మూన్నాళ్లకే పాడైపోతున్నాయి. దీంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రతీలారీలో 15 టన్నుల నుండి 20టన్నుల వరకు ఖనిజాన్ని రవాణా చేయాల్సి ఉండగా 40టన్నులను తరలిస్తున్నారు. ఇసుక, సిమెంట్, సుద్ద రవాణా వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయి. ఓవర్‌లోడ్ లారీల వల్ల ఏటా కోట్లలో నష్టం వాటిల్లుతోందనే అంచనా. దీన్ని ఆర్‌అండ్‌బీ శాఖనే భరిస్తోంది.



ఓవర్‌లోడ్ వాహనాలతో ధ్వంసమైన కరన్‌కోట్ రోడ్డు

రోడ్లు, వంతెనల ఉనికికి ప్రమాదం

ఓవర్‌లోడ్‌ను ఉపేక్షిస్తే రోడ్లు, వంతెనల ఉనికికి ప్రమాదం వాటిల్లే అవకాశముందనే అభిప్రాయం ఉంది. అధిక బరువు వాహనాల రాకపోకలతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. తాండూరు నుంచి నాపరాయిరాళ్లు, పాలిషింగ్ బండలు తాండూరు మీదుగా హైదరాబాద్, ముంబై, కర్నూల్, కడప వంటి సుదూర ప్రాంతాలకు నాపరాయిని తరలిస్తుంటారు. మండలంలోని ఓగీపూర్ గ్రామ శివారులో విస్తరించిన నాపరాయి గనుల నుంచి, కరణ్‌కోట్‌లో నిర్మించిన సీసీఐ సిమెంట్ కర్మాగారం నుంచి, మల్కాపూర్ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం, మల్కాపూర్, కోటబాస్పల్లి శివారు నుంచి నాపరాయి, సిమెంటు తరలుతోంది. మరోపక్క పాషాపూర్, అడ్కిచర్ల, తట్టేపల్లి, తదితర ప్రాంతాల నుంచి ఎర్రమట్టిని అధికలోడ్‌తో సిమెంటు కర్మాగారాలకు రవాణా అవుతున్నాయి. రెగ్యులర్ వాహనాలు కావడంతో చెక్‌పోస్టులకు, తనిఖీ అధికారులకు తక్కువబరువు ఉన్న రశీదులను చూయించి అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై కరన్‌కోట్ గ్రామస్తులు ఓవర్‌లోడ్‌తో వెళుతున్న లారీలను నియంత్రించాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం సైతం అందజేశారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఓవర్‌లోడ్ లారీలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



కొడంగల్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే కొత్తూర్ పరిధిలోని జహంగీర్ పీర్ దర్గాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొడంగల్ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీయాదవ్ కుటుంబసభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా దర్గాలో పూలచాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



పరిగిలో కొత్త అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

రూ.25కోట్లతో ప్రభుత్వాసుపత్రి విస్తరణ

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- 85మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పరిగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిగి ప్రభుత్వాసుపత్రిని రూ.25కోట్లతో విస్తరించనున్నట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి ప్రభుత్వాసుపత్రిలో రెండు కొత్త 108అంబులెన్స్‌లను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 85మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ప్రభుత్వాస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా మారుస్తామని తెలిపారు. వికారాబాద్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా పరిగిలో ఆస్పత్రిని ప్రారంభిస్తామని తెలిపారు. వారానికోసారి ఇక్కడి వైద్యులు పరిగికి వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు. పేదలందరికీ ఉచిత వైద్యానికి తాను పూర్తి భరోసాను ఇస్తానని తెలిపారు. ఆరోగ్యశ్రీ అందని వారందరికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూతనందిస్తామని తెలిపారు. పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడరాదన్నారు. ఏపథకం కింద వర్తించని వారికి కూడా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, చిట్యాల్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు బి.పరశురాంరెడ్డి, బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శులు కె.హన్మంత్‌ముదిరాజ్, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముద్దాయిపేట్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు




ముద్దాయిపేట్ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

యాలాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ముద్దాయిపేట్ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నసాగర్ గ్రామంలో గల చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జనవరి 19న ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర




ఘట్‌కేసర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర వచ్చేనెల 19న నిర్వహించాలని పట్టణ పెద్దలు నిర్ణయించారు. ఘట్‌కేసర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గట్టుమైసమ్మ జాతర సన్నాహక సమావేశంలో పలువురు మాట్లాడారు. వచ్చేనెల 19న జాతర జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. ఇందుకోసం కులాల వారీగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. జాతర విజయవంతం చేసేందుకు ప్రతీఒక్కరు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, ఈవో భాగ్యలక్ష్మి, నాయకులు ముత్యాలు, రాధాకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

















పెద్దచెరువులో కొండ చిలువ కలకలం



వలకు చిక్కిన కొండ చిలువ

దౌల్తాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద చెరువులో కొండచిలువ కలకలం రేపింది. ఆదివారం ఉదయం చేపలవేటకు వెళ్లి మత్స్యకారుల వలలో ఓ కొండ చిలువ చిక్కడంతో వారు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు ఫరూక్ అలీ సిబ్బందితో అక్కడికి చేరుకొని స్థానికంగా పాములు పట్టే వ్యక్తిని పిలిపించి కొండ చిలువను సురక్షితంగా వలలో నుంచి బయటకు తీసి పెద్ద చెరువు సమీపంలో గల అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవిగౌడ్, పోలీసుసిబ్బంది శ్రీశైలం, రైతులు వెంకటేశ్ ఉన్నారు.

సమాజ అభివృద్ధిలో ముందుండాలి



తేజ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యంవీఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ శాంతాసిన్హా

వికారాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో యంవీఎఫ్ పూర్వవిద్యార్థులు ముందుండాలని యంవీఎఫ్ (మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్) సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శాంతాసిన్హా అన్నారు. వికారాబాద్ పట్టణంలోని తేజ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం యంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. చదువుకు దూరంగా ఉన్న వేలాది మంది విద్యార్థులను తీసుకువచ్చి తీర్చిదిద్దిన ఘనత యంవీఎఫ్‌కే దక్కుతుందన్నారు. బాల కార్మికులుగా ఉన్న విద్యార్థులను ఎంతో ఉత్తమ విద్యార్థులుగా ఉంటూ అన్నిరంగాల్లో ముందు వరుసలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యంవీఎఫ్ జాతీయ కోఆర్డినేటర్, రాష్ట్ర విద్యాశాఖ సలహాదారు వెంకట్‌రెడ్డి, యంవీఎఫ్ సంస్థ యండీ విక్రమ్, కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు శివరాములు, హరిహరరెడ్డి, మాణిక్యం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆర్‌ఎంపీలపై కేసు నమోదు

వికారాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిపిస్తున్న ముగ్గురు ఆర్‌ఎంపీలపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ మామిళ్ల రాములు ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీలు నడుపుతున్న ప్రైవేటు క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీలు వైద్య సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా పట్టాపొందిన డాక్టర్ల మాదిరిగా వైద్యచికిత్సలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు నాగేందర్, నాగయ్య, దానయ్యలను గుర్తించారు. ఈమేరకు విజిలెన్స్ అధికారి మామిళ్ల రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న మండ్లీ రాములు

ఆమనగల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కోరారు. ఆత్మస్థైర్యం, పట్టుదలతో ముందుకు సాగే వారు ఏ రంగంలోనైన రాణిస్తారని ఆయన అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ మూడో వార్డు నుచ్చుగుట్ట తండాలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను రాములు ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పలు టీంలు టోర్నీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్య, క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రత్యేక క్రీడా పాలసీని రూపొందించి అమలు కు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీర్యానాయక్, కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు సంతోష్, కుమార్,రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీటింగ్.. చీటింగ్!

న్యూఇయర్ విషెస్ లింక్‌లతో బీకేర్‌ఫుల్

- ఫేక్ లింక్‌లు ఓపెన్ చేస్తే అంతే సంగతులు
- ఒక్క క్లిక్‌తో ఖాతాలో డబ్బులు మాయం!
- రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

చేవెళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఎంత పెరుగుతుందో మోసాలు అంతే స్థాయిలో ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్నెట్ యుగంలో బ్యాకింగ్ సేవలు సులువయ్యాయి. దాంతో చిటికెలో నగదు లావాదేవీలు సాగిపోతున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌పై సంపూర్ణ అవగాహన ఉన్నవారు అతికొద్ది మందైతే.. పెద్దగా పరిజ్ఞానం లేనివారు కోకొల్లలు. ఇలాంటి వారినే సైబర్ నేరస్తులు లక్ష్యంగా చేసుకొని బురిడీ కొట్టిస్తూ, నగదును కాజేస్తున్నారు. ఈ తరహాలో మోసపోతున్న వారిసంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఖాతాదారులకు పోలీస్‌లు, అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. మోసగాళ్లు అంతేస్థాయిలో రెచ్చిపోతూ కొత్త కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. కాగా, మరో రెండు రోజుల్లో రాబోతున్న నూతన సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పే వేళ సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమవుతున్నారు. న్యూఇయర్ విషెస్ పేరిట మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా సందేశాల లింక్‌లు పంపిస్తున్నారు. అయితే, గుర్తుతెలియని నెంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను ఏమాత్రం క్లిక్ చేసినా మీ అకౌంట్లలో నగదును క్షణాల్లో మాయం చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు రోజులూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌లు సూచిస్తున్నారు.

సైబర్ నేరగాళ్లు ఏం చేస్తారంటే..

మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సరం(2025)లోకి అడుగు పెట్టబోతున్నాం. డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచే విషెస్ హంగామా మొదలవుతుంది. బంధువులకు, శ్రేయోభిలాషులకు ఒక్కొక్కరూ ఒక్కో విధంగా శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రణాళికలు వేసుకుంటారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూ మొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు(ఎమోజీలు), సందేశాలతో మెసేజ్‌లు పంపుతారు. అయితే, ఇదే అదనుగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు ఇక్కడే రంగంలోకి దిగుతారు. మీకు నచ్చేవిధంగా మీ పేరుతో గ్రీటింగ్ సందేశాలను పంపుకోవచ్చని చెబుతూనే మీరు చేయాల్సిందల్లా.. ఈ కింద లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని అంటారు. మన మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్‌లకు ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపుతారు. పొరపాటున లింక్‌పై క్లిక్ చేస్తే అంతే సంగతులు. మన ఫోన్‌లో సమాచారమంతా వారికి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. కాంటాక్ట్ నెంబర్లు, ఫొటోలు వీడియోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు డాక్యుమెంట్ ఫైళ్లు సైతం వారికి చేరిపోతాయి.



జాగ్రత్తలు తప్పనిసరి

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీకిట్) ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు.

- ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ షోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కావు.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నెంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- తెలియని ఏపీకే ఫైల్, మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయితే ఫోన్‌లో రీసెట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి
- ఈ-మెయిల్స్, టెక్స్ట్, ఇతర సోషల్ మీడియా యాప్‌ల ద్వారా నకిలీ లింక్స్‌ను గుర్తించాలి. వాటిపై క్లిక్ చేయరాదు.
- గివ్ అవేస్ పోటీల ద్వారా వినియోగదారులను ట్రాప్‌చేసి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. వివరాలను సేకరించి డార్క్‌వెబ్‌కు అమ్మేస్తారు.
- మొబైల్, ల్యాబ్‌టాప్, కంప్యూటర్‌లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్ ప్రోగ్రామ్, అధికారిక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు మార్పులు చేస్తుంటాయి.

లింక్‌లపై క్లిక్ చేయొద్దు



అపరిచిత వ్యక్తులు పంపే ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైళ్లను, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తారు. న్యూఇయర్ విషెస్ చెప్పాలనుకునేవారు ఫోన్ ద్వారా మాట కలపడం, సందేశాన్ని పంపడం, వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవడం మంచిది. సైబర్ నేరగాళ్ల వలలోపడి మోసపోవద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- భూపాల్ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్, చేవెళ్ల

కీలక మలుపులు

(5వ పేజీ తరువాయి)

చేరి చేవెళ్ల ఎంపీ టికెట్ దక్కించుకున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన రాగిడి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నుంచి పోటీ చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ఓటమి చెందారు. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ కాంగ్రెస్ మల్కాజిగిరి సిట్టింగ్ స్థానాన్ని తిరిగి గెలవలేకపోయింది. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఆ నియోజవర్గంలో తిరిగి కాంగ్రెస్ జెండా ఎగరలేదు. చేవెళ్ల, మల్కాజిగిరి నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, సునితా మహేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిరిగి నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘన విజయం సాధించారు.

వరించిన నామినేటెడ్ పదవులు..

కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన నేతలకు అధిష్ఠానం ప్రాధాన్యత కల్పించింది. ఎన్నికలకు ముందు టికెట్ ఆశించి బంగపడిన నేతల్లో కొందరికి ఇప్పటికే నామినేటెడ్ పదవులను కట్టబెట్టింది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎల్బీనగర్ సీనియర్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డి, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కార్పొరేషన్ పదవులు దక్కాయి. పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డికి దక్కింది. రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి, ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్‌ను నియమించింది. సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడిగా పేరొందిన షాబాద్ మండలానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి చిలక మధుసూదన్‌రెడ్డిని వరించింది. అలాగే రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్‌గా చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లికి చెందిన చింపుల సత్యనారాయణరెడ్డికి దక్కింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా అవకాశం దక్కింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గాని పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రాజేశ్వర్‌రెడ్డికి దక్కింది. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కల్వ సుజాతకు దక్కింది. రమేశ్ మహారాజ్‌కు స్టేట్ కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు.

లగచర్లలో అధికారులపై దాడి.. కేసులు నమోదు

వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. వికారాబాద్ జిల్లా హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల పరిధిలో 1,358.37 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ఫార్మ విలేజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కావాల్సిన భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫార్మా వద్దంటూ పోలేపల్లి, లగచర్ల గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలంలో ఫార్మా కారిడార్ ఏర్పాటు కోసం నిర్వహించ తలపెట్టిన భూ సేకరణ కోసం ఈ ఏడాది నవంబరు 11న అధికారులు లగచర్ల గ్రామంలో ప్రజాభిప్రాయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం రణరంగంగా మారింది. ఆయా గ్రామాల రైతులు సమావేశాన్ని బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన అధికారులు రైతులతో మాట్లాడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో భూ సేకరణను వ్యతిరేకిస్తున్న అక్కడి ప్రజలు అధికారులపై దాడికి యత్నించారు. కలెక్టర్‌తో పాటు అక్కడికి వచ్చిన అధికారులపై దాడికి పాల్పడటంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందని పట్నం నరేందర్‌రెడ్డిని ఏ-1గా అరెస్టు చేశారు. ఈ కుట్రకు కారకుడైన సురేష్ పారిపోగా అతన్ని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజుల తర్వాత నరేందర్‌రెడ్డితో పాటు కొంత మంది రైతులకు నాంపల్లి ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

వరుస జంపింగ్‌లతో ఉక్కిరిబిక్కిరి

ఈ ఏడాది బీఆర్‌ఎస్ పార్టీకి షాకుల మీద షాకులు తగలాయి. వరుస జంపింగ్‌లతో బీఆర్‌ఎస్ ఉక్కిరిబిక్కిరైంది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో అత్యంత ఆసక్తికరమైన రాజకీయాలు చోటు చేసుకున్నాయి. ఓ వైపు మెజార్టీ సీట్లలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతూ ఆకర్ష్‌కు మరింత పదును పెట్టింది. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ నేతలను, ఎమ్మెల్యేలు, ఎంపీలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంతో వరుసకట్టారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డితో పాటు ఆమె మామ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సైతం హస్తం గూటికి చేరుకున్నారు. ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ.. ఇంకా శివారు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాపై ఇంకా కాంగ్రెస్ పట్టు సాధించలేక పోతుంది.

ద్వితీయశ్రేణి నాయకుల ఎదురుచూపు

పంచాయతీల పాలకవర్గం ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన ముగిసింది. జిల్లా పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం జూలై 3వ తేదీతో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ ఏడాది నవంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అనుకున్నప్పటికీ.. రిజర్వేషన్ల కారణంగా బ్రేక్ పడింది. బీసీ కుల గణన తర్వాతనే స్థానిక నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే కుటుంబ సర్వే పూర్తి చేశారు. ఇక త్వరలో ఎన్నికల నగరా మోగనుంది. ఎన్నికల కోసం ద్వితీయ శ్రేణి నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 59వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా గ్రామంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, మహిళలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రభుత్వ పరంగా సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. గట్టిప్పలపల్లి మండలకేంద్రం ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలంగా ఉందన్నారు. దీక్షల్లో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు ఆంజనేయులు గౌడ్, పద్మమ్మ, జంగమ్మ, రాములమ్మ, లక్ష్మమ్మ, శ్యామల కుమార, వెంకటయ్య, కృష్ణాజీ, బక్కుల్, పెంటోజీ, నర్సింహ, మాణిక్యరెడ్డి, రాజు, జంగయ్య, కృష్ణయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాపం పసికందు

- ఆటో టైరుకింద నలిగి ప్రాణాలు కోల్పోయిన చిన్నారి
- పాల డబ్బాలు లోడ్ చేస్తుండగా ఘటన.. గమనించని డ్రైవర్
- ఆటోను ముందుకు తీయడంతో ప్రాణాలు కోల్పోయిన పాప



మృతదేహం చిన్నారి ప్రియాన్సి

తలకొండపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పటివరకూ ఆడుకుంటున్న 11 నెలల పసికందు.. ఉన్నట్టుండి ఆటో కిందికి వెళ్లడంతో డ్రైవర్ గమనించకుండా ముందుకు పోనిచ్చాడు. దాంతో ఆ పాప టైరు కింద నలిగి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన పుష్పరాజ్ యాదవాసి కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం పడకల్‌కు వచ్చారు. గ్రామానికి చెందిన ఓ రైతు డెయిరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం పాల డబ్బాలను ఆటోలో లోడ్ చేస్తున్నారు. పుష్పరాజ్ 11 నెలల కూతురు ప్రియాన్సి ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లింది. గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు తీయడంతో చిన్నారి టైరు కింద పడి తీవ్రంగా గాయపడింది. కడ్తాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చిన్నారిని పరీక్షించి అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. పుష్పరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ఐదు రోజుల క్రితం డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆదిభట్ల నుంచి టీసీఎస్ వైపునకు వస్తున్న డీసీఎం.. ఎ-రెడీ మిక్స్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దాంతో డ్రైవర్ రోడ్డు పక్కన ఉన్న 33 కేవీ ఎంప్లాస్టిక్ స్తంభాన్ని ఢీకొనడంతో పూర్తిగా ధ్వంసమైంది. అయితే, అధికారులు డీసీఎంను అక్కడి నుంచి తరలించలేదు. స్తంభాన్ని దాదాపు రూ.3.50 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. నాలుగైదు రోజుల నుంచి డీసీఎం అక్కడే ఉండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఆదిభట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి)

తాగునీటిలో కలుస్తున్న మురుగు

- 22రోజులుగా పైప్‌లైన్ మరమ్మతులు
- అధికారుల నిర్లక్ష్యం
- ముందుకు సాగని పనులు
- ఘట్‌కేసర్‌లో 17వ వార్డు వాసుల ఆవేదన



17వ వార్డులో 22 రోజులుగా కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు

ఘట్‌కేసర్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ లీకేజీతో తాగునీటిలో మురుగునీరు కలుస్తోందని, మరమ్మత్తులు చేయాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక కౌన్సిలర్‌తో పాటు స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని రైల్వే స్టేషన్‌రోడ్డులోని పలు ఇళ్లకు తాగునీటిలో మురుగునీరు కలుస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయాన్ని స్థానిక కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావుకు వివరించారు. దీంతో ఆయన మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు సమస్యను వివరించారు. దీంతో అధికారులు వచ్చి పరిశీలించి పనులు చేపట్టినప్పటికీ ఏమాత్రం ముందుకు సాగడంలేదని స్థానికులు వాపోయారు. తవ్వకాలు ప్రారంభించినప్పటికీ 22రోజులుగా పనులు కొనసాగడమేంటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం సిబ్బంది వచ్చి పని చేపట్టగానే తిరిగి వారిని మరోచోటుకు పంపిస్తుండటంతో ఈసమస్య తీరడం లేదని కౌన్సిలర్ తెలిపారు. మిషన్‌భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికి వచ్చే కొద్దిపాటి నీరుసరిపోక జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరాచేసినట్లు గుర్తుచేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారులు స్పందించడంలేదు



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో డ్రైనేజీ పగిలి తాగునీరు కలుషితమవుతున్నదని మున్సిపల్ అధికారులకు అనేకసార్లు చెప్పినా స్పందించడంలేదు. చెప్పిన ప్రతీసారి నామమాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారు. ఇలా 22రోజులు గడుస్తున్నా డ్రైనేజీ మరమ్మతు పనులు పూర్తికాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

- బేతాల నర్సింగ్‌రావు, కౌన్సిలర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ



శివాలయంలో భక్తుల పూజలు

భక్తిశ్రద్ధలతో మరకత శివలింగానికి పూజలు

యాచారం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పురస్కరించుకొని ఆదివారం తక్కళ్లపల్లి గుట్టపై వెలసిన శ్రీ గోదాదేవిపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు శివాలయంలో మరకత శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. నందివనపర్తిలోని శ్రీఓంకారేశ్వరాలయం, నందీశ్వరాలయం, శివాలయం లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఓంకారేశ్వరాలయంలో రుద్రాభిషేకం చేశారు.

బాధితుడికి పరామర్శ

తలకొండపల్లి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మైసయ్య అనారోగ్యానికి గురై అపోలో ఆసుపత్రిలోకి చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేలు అందించారు.

- దుర్వాసనతో జనం ఇబ్బందులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి
- వ్యర్థాలు పారబోస్తున్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు

రోడ్డు పక్కనే వ్యర్థాలు



కిషన్‌నగర్ వెళ్లే రోడ్డు పక్కన పారబోసిన వ్యర్థాలు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని పరిగి ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కిషన్‌నగర్ వెళ్లేదారిలో రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో వాహనదారులు, ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో గతంలో మట్టి తవ్వకాలు జరపడంతో పెద్ద గోతి ఏర్పడింది. దాంతో అందులో వ్యర్థాలు పోస్తున్నారు. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేవారు గతంలో అక్కడ ఉన్న గుంత పక్కన గల కల్వర్టుపై కొద్దిసేపు కూర్చొని సేదతీరేవారు. ప్రస్తుతం దుర్వాసనతో అక్కడ కూర్చోలేని పరిస్థితి నెలకొంది. గోతిలో వ్యర్థాలు పోస్తున్న విషయాన్ని ఇంతకుముందు హాజిపల్లి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి గోతికి అడ్డంగా మట్టి పోయించారు. దాంతో కొన్ని రోజులు వ్యర్థాలు పోయలేదు. ఇటీవల మళ్లీ పోసిన మట్టిపైన కూడా వ్యర్థాలు పోస్తున్నారు. ఆరు బయట చెత్త వేయరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొందరు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి.. కొన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి గోతిలో పారబోస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాటసారులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఉదయం 5 గంటలకు చాలామంది కిషన్‌నగర్ రోడ్డు మీదుగా వాకింగ్‌కు వెళ్తుంటాం. హాజిపల్లి శివారులో రోడ్డు పక్కన ఉన్న గోతిలో ఫంక్షన్ హాళ్ల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి పారబోస్తున్నారు. దాంతో రోడ్డుపై వెళ్తుంటే దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకొని వ్యర్థాలు గోతలో పారబోయకుండా చూడాలి.

- మల్లేష్ యాదవ్, మల్లికార్జున కాలనీ, షాద్‌నగర్

క్రైం కార్నర్

క్రిమి సంహారక మందు కలిసిన కల్లుతాగి ఒకరి మృతి

● మరొకరికి అస్వస్థత



జంగయ్య గౌడ్(ఫైల్)

మాడ్గుల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రిమి సంహారక మందు కలిసిన కల్లు తాగి ఒకరు మృతిచెందగా.. మరొకరు అస్వస్థతకు గురైన సంఘటన మండల పరిధిలోని పాతబ్రాహ్మణపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈమేరకు గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కేశమోని జంగయ్యగౌడ్ తాను కల్లు తీసే చెట్టుకు పురుగు పట్టిందని క్రిమి సంహారక మందును దూదికి అంటించి కల్లు కారేచోట ఉంచాడు. అలా ఆ మందు కలిసిన కల్లును వారం రోజుల క్రితం జంగయ్యగౌడ్, అదే గ్రామానికి చెందిన కట్ట వెంకటయ్య తాగారు. దాంతో వారు అస్వస్థతకు గురయ్యారు. వారిని కుటుంబ సభ్యులు మాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జంగయ్యగౌడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఆదివారం హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా కట్ట వెంకటయ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతడి పరిస్థితి కూడా విషమంగా ఉందని చెప్పారు. మృతుడు జంగయ్యకు భార్య, ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు.

గండిపేట చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మొయినాబాద్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండిపేట చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలోని గండిపేట చెరువులో గుర్తుతెలియని మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల లోపు ఉంటుందని, మృతదేహంపై చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ఉన్నాయి. అతడు మృతి చెంది దాదాపు 3 రోజులవుతున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



కందుకూరు : తిమ్మాపురంలో నిర్వహించిన పూజలో కావ్యా కిషన్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్

మహేశ్వరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి, ఇరుముడిపూజ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఇరుముడి పూజ సందర్భంగా పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప పూజతో పెండ్యాల పరిసర ప్రాంతం అయ్యప్ప నామసర్మరణతో మారుమోగింది. సబితారెడ్డి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు డి. వెంకటేశ్వర్‌రెడ్డి, రాజునాయక్, రాజేష్, లింగం, అంబయ్యయాదవ్, ఆదిల్, క్రె.ప్రభాకర్ తదితరులున్నారు. కాగా, శ్రీశైలం-హైదరాబాద్ హైవేలో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంగూడ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఓ బేకరీని ఎమ్మెల్యే ప్రారంభించారు.

కందుకూరు : తనాతన ధర్మాన్ని ప్రతీఒక్కరు బాధ్యతతో పాటించాలని, దేశ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతీ సంవత్సరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అయ్యప్ప మాలలు ధరించడంతో మన ధర్మాన్ని పెంపొందిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపురంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప ఇరుముడి మహాపడిపూజలో బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మాపురం గ్రామం నుంచి 33మంది అయ్యప్ప మాలధారణ స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. పార్టీ మహేశ్వరం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంద జ్యోతిపాండు, మాజీ సర్పంచ్ భిక్షపతి, నాయకులు గంగాపురం అమరేందర్‌రెడ్డి, జి.రాజేందర్‌రెడ్డి, డిల్లీ వెంకటేష్, సి.మల్లేష్, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మహేశ్వరం : పెండ్యాలలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆమనగల్లు : అయ్యప్పస్వామి పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఆమనగల్లులో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ఛైర్మన్, గురుస్వామి తల్లోజు ఆచారి, అ య్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో అయ్యప్ప భక్తులు, మాలధారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో మణికంఠునికి ప్రత్యేక పూజలు అభిషేకాదులు నిర్వహించారు. సంఘ సేవకులు పాపిశెట్టి రాము, దీక్షాపరులు చుక్క ఆనంద్ గౌడ్, బండమల్లేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : పల్లకీ సేవలో అ య్యప్పస్వాములు

ఇజ్తిమా ఏర్పాట్లను పూర్తి చేయాలి



శంకర్‌పల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/శంకర్‌పల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇజ్తిమా గాహ్ సభ ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. ఈమేరకు శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో జనవరి 4, 5వ తేదీల్లో నిర్వహించే ఇజ్తిమా గాహ్ కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే పలువురు మైనార్టీ నాయకులు, నిర్వాహకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఇజ్తిమా గాహ్ సభ ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. ఇజ్తిమాకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే మైనారీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

మాజీ ఎంపీ జగన్నాథ్‌కు కేటీఆర్ పరామర్శ



జగన్నాథ్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

ఆమనగల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథ్‌ను ఆదివారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన జగన్నాథ్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేటీఆర్ ఆసుపత్రికి చేరుకొని జగన్నాథంను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. జగన్నాథ్ కుమారుడు మంద శ్రీనాథ్, కూతురు డాక్టర్ పల్లవిలకు మనోధైర్యం కల్పించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు యాదిలాల్ పరామర్శించారు. ఆమనగల్లు చేనేత సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, రాముగౌడ్ ఉన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

● పట్టించుకోని అధికార యంత్రాంగం.. ప్రజల ఇబ్బందులు



హిమాయత్ నగర్ ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వంతో మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో ప్రధాన రోడ్డుపై కొన్ని నెలల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. మేజర్ గ్రామ పంచాయతీ కావడం, తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి అవ్వడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ రహదారిపై ఎన్నో నెలల నుంచి ఈ సమస్య ఇలాగే ఉంటోంది. ప్రత్యేకాధికారి సైతం ఇటువైపు చూడడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న అండర్‌డ్రైనేజీ కాలువల వద్ద మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు బయటికి వచ్చి రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువల్లో పేరుకపోయిన చెత్తను కూడా సిబ్బంది తొలగించడం లేదని, కొందరు అందులో రాళ్లు వేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కుమ్మరి బస్తీ నుంచి సాయిబాబా దేవాలయం వరకు హిమాయత్ నగర్ గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. మురుగు నీరు కారణంగా ప్రధాన రోడ్డుపై దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు సంచరిస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

● పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్



రవిచంద్రకు నియామకపత్రం అందజేస్తున్న ప్రతాప్

ఆదిభట్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం కావాలని, బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఆదివారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లిలో 134వ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయని, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాడుతూనే పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని తెలిపారు. అనంతరం బూత్‌స్థాయి అధ్యక్షుడిగా వలిగొండ రవిచంద్రను ఎన్నుకున్నారు. గోగిరెడ్డి లచ్చిరెడ్డి, నారాయణయాదవ్, పొట్లి రాములు, గజ్జల నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత

(5వ పేజీ తరువాయి)

మొదట్లో పచ్చటి విరోచనాలై.. మెడలు వంకర్లు పోయి కుప్పకూలుతున్నాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి మృత్యువాత పడుతున్నాయి. ఈ వ్యాధి సమీపంలోని ఇతర పౌల్ట్రీషెడ్లకు విస్తరించి అక్కడా కోళ్లు చనిపోతున్నాయి. పదివేల సామర్థ్యం గల పౌల్ట్రీ షెడ్డుకు ఖర్చులు పోను ఒక్కో బ్యాచ్‌కు రైతులకు రూ.లక్షన్నరదాకా గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం కోళ్ల చనిపోతుండటంతో పెట్టుబడి అటుంచితే రూ.యాభై వేల వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పర్యవేక్షణ కరువు..

కోళ్లపరిశ్రమపై ప్రభుత్వ నియంత్రణ కొరవడటంతో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం కొనసాగుతోంది. దీంతో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి షెడ్లు నిర్మించుకున్న రైతులు కార్పొరేట్ సంస్థలకు లీజుకిచ్చి కట్టుబానిసలుగా మారిపోయారు. కోడిపిల్లలు, దాణా ను సదరు కంపెనీ సరఫరా చేస్తుంది. కోళ్ల పెంపకం కోసం కోడిపిల్లలు వచ్చేలోగానే రైతులు వరిపొట్టు, బొగ్గులు సొంత ఖర్చుతో సిద్ధం చేసుకుంటారు. మందులను కంపెనీయే సరఫరా చేసి రైతుల ఖర్చులో జమచేస్తుంది. ఆ తర్వాత ఫ్యాన్లు, ఇతర పనుల కోసం పౌల్ట్రీ రైతులను ఆర్థికంగా పీల్చి పిప్పిచేస్తారు. ఇంత కష్టం చేసిన రైతులకు ఒక్కో బ్యాచ్‌కు సంబంధించి కిలోకు సుమారు రూ.4 వరకు చెల్లించి చేతులు దులుపుకుంటారు. ఈ తర్వాత కార్పొరేట్ సంస్థలు సిండికేట్లుగా ఏర్పడి వినియోగదారుల నుంచి వందల రూపాయలు వసూలు చేస్తూ ఆదాయాన్ని గడిస్తున్నారు. గిట్టుబాటుపై ఎవరైనా రైతులు ప్రశ్నిస్తే వారిపై వేధింపులకు పాల్పడుతూ కోడిపిల్లల సరఫరాను నిలిపేస్తున్నారు. ఇలా ఇటీవలి కాలంలో ఆరుట్లలో ఆందోళన చేసిన రైతులకు రెండుమూడేళ్ల పాటు కోళ్ల సరఫరా నిలిపివేశారు. పౌల్ట్రీ రైతులపై కార్పొరేట్ సంస్థల వేధింపులు ఇంత భయానకంగా ఉన్నా ఇదేమని అడిగే నాథుడే లేడు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో వేధింపులు తారాస్థాయికి చేరాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పౌల్ట్రీ నిర్వహణలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న వేధింపులపై నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాల్సిందిగా బాధిత రైతులు కోరుతున్నారు.



ఆర్‌డీ వ్యాధితో మృత్యువాత పడ్డ కోళ్లు

కష్టజీవులకు అండగా ఎర్రజెండా

● సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



తోలుకట్టలో జెండా ఆవిష్కరణలో రామస్వామి, తదితరులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక న్యాయం, సమాన హక్కులు, కార్మిక కర్షకుల హక్కుల కోసం సీపీఐ ఎనలేని పోరాటాలు చేసిందని, కష్టజీవులకు అండగా ఎర్రజెండా ఉంటుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంపై పోరాటం చేసి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతోత్సవాల సందర్భంగా మండలంలోని సజ్జన్‌పల్లి, తోలుకట్ట, పెద్దమంగళారం గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో రామస్వామి పాల్గొని జెండాలను అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం, సామాజిక న్యాయం, సమాన హక్కులు, కార్మిక కర్షకుల హక్కుల కోసం సీపీఐ ఎనలేని పోరాటాలు చేసిందని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాస్తున్నారని పాలకులపై మండిపడ్డారు. దేశంలో కార్మికుల చట్టాలు, రైతుల చట్టాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మిక కర్షకులకు వ్యతిరేరంగా చట్టాలు తీసుకువచ్చి వారిని నష్టదాయకం చేస్తున్నారని ఆరోపించారు. కష్టజీవులకు అండగా ఉన్న పార్టీ సీపీఐ అని తెలిపారు. గతంలో తోలుకట్ట గ్రామంలో నిరుపేదలకు ఇళ్లు ఇప్పించిన ఘనత సీపీఐకే దక్కుతుందని అన్నారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్దఎత్తున నాయకులు, కార్మికులు, అభిమానులు తరలిరావాలని పిలునిచ్చారు. సీనియర్ నాయకులు ప్రభులింగం, ఏఐటీసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బీకేఎం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సుధాకర్ గౌడ్, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీను, యాదగిరి, యశోద, లక్ష్మణ్, బాల్‌రాజ్, వెంకటేష్, తూర్పు నర్సింహాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేత

తలకొండపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధి సంగాయిపల్లి గ్రామానికి చెందిన అంతారం చెన్నయ్య ఇంటి నిర్మాణానికి చేయూతనందించాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేశ్ కోరారు. స్పందించిన వెంకటేశ్ ఆదివారం చెన్నయ్య ఇంటినిర్మాణానికి అవసమైన మెటీరియల్‌ను సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. నాయకులు తిరుపతయ్య, సంపత్ కుమార్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంతో దైవానుగ్రహం

కడ్తాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సన్మార్గంతో దైవానుగ్రహం లభిస్తుందని ఆమనగల్లు మాజీ వైస్‌ఎంపీపీ, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు జక్కు అనంత రెడ్డి అన్నారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు, మానవాళి సన్మార్గ పురోగమనానికి దోదపడతాయని ఆయన అన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. దైవ కార్యక్రమాలలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగంటి పుష్పలత, నర్సింహారెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, మౌనిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో నాయకులు

మాడ్గుల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సూదిని శరత్‌రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఓఆర్ఆర్ సమీపంలోని గల ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, ఆయన అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నేపాక కిరణ్, కాట్ల మహేష్‌గౌడ్, బొమ్మ పర్వతాలు, వరికుప్పల వెంకటరమణ, సింగమ్ మధుకర్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

ఆమనగల్లు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని నాయకులు అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఆదివారం మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. యువజన సంఘాలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రేషన్ డీలర్ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రేషన్‌డీలర్ మహ్మద్ అన్వర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని కరేషన్ డీలర్స్ సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. అన్వర్ మృతిపట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సజాతమల్లేశ్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, బీచ్యానాయక్, టీక్‌లాల్, జంగయ్య, లక్ష్మయ్య, సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్, బుగ్గమ్మ, దశరథ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి



ఎన్నిక పత్రం ఇస్తున్న చెక్కాల లక్ష్మణ్

ఆమనగల్లు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లిలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, భూత్ కమిటీ ఎన్నికలు, ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించారు. 189వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా గజ్జె కేశవులు, ప్రధాన కార్యదర్శిగా లోడిగ శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ సోషల్ మీడియా కల్వకుర్తి కన్వీనర్ పద్మ ప్రశాంత్, రాము, శ్రీకాంత్, చరణ్, అశోక్, సాయికిరణ్, రవీందర్, భరత్, రమేశ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.